సాక్షి శ్రీకాకుళం

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



రూట్‌మ్యాప్ ఇలా..

అరసవల్లిలో రథసప్తమికి రూట్‌మ్యాప్ తయారు చేశారు. ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. - 8లో



రైతు ప్రయోజనాలే..

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. పలు ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. - 8లో

నేడు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతాయని జెడ్పీ సీఈఓ డి.వెంకటేశ్వరరావు తెలియజేశారు. 10 గంటలకు 6వ స్థాయీ, 11 గంటలకు 3వ, 12 గంటలకు 5వ, మధ్యాహ్నం 2 గంటలకు 2వ, 3 గంటలకు 4వ, 4 గంటలకు 7వ, 5 గంటలకు 1వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

‘ఏకం’ ఐఏఎస్ అకాడమీ అవగాహన సదస్సు నేడు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక ‘ఏకం ఐఏఎస్ అకాడమీ’ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో యూపీఎస్సీ తదితర పరీక్షల సన్నద్ధతపై శనివారం ఉదయం 9.30 గంటల నుంచి శ్రీకాకుళంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ అబ్బూరి శ్రీలేఖ, డైరెక్టర్ మేజర్ ఒబెరాయ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళా మందిరం వేదికగా జరిగే ఈ సదస్సుకు ఆసక్తి కలిగిన ఔత్సాహికులు హాజరుకావచ్చని చెప్పారు. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్ తదితరులు హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు.

జిల్లా దేవదాయ శాఖాధికారిగా ప్రసాద్ పట్నాయక్



అరసవల్లి: జిల్లా దేవదాయ శాఖాధికారిగా అసిస్టెంట్ కమిషనర్ బలివాడ రవి వెంకట వినాయక ప్రసాద్ పట్నాయక్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలోనే సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రసాద్‌పట్నాయక్‌కు అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి ఇస్తూ ఇక్కడే జిల్లా అధికారిగా నియమించారు. దీంతో శుక్రవారం ఉదయమే ప్రసాద్‌పట్నాయక్ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు జిల్లా దేవదాయ శాఖాధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించిన వి.హరిసూర్యప్రకాష్‌కు నిడదవోలు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ప్రసాద్‌పట్నాయక్ గతంలో జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాలకు ఈఓగా పనిచేశారు.

‘డిక్లరేషన్ సరి చూసుకోవాలి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోస్టల్ బ్యాలెట్‌పై ఉన్న డిక్లరేషన్, సంబంధిత ఫారాలు అన్నీ సరి చూసుకోవాలని డ్వామా పీడీ చిట్టిరాజు చెప్పారు. సర్వీసు ఓటర్లు, డ్యూటీ చేసిన వారి ఓట్లు రెండు రకాలుగా ఉంటాయన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు అవసరమైన పేపర్లు కలిపి పెట్టాలని వివరించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలు–2024లకు సంబంధించి శుక్రవారం (ఎఎల్ఎంటి) మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ తరగతుల్లో జిల్లా మాస్టర్ ట్రైనర్స్ చిట్టిరాజుతో పాటు మెప్మా పీడీ కిరణ్ కుమార్, గార మండలం ఉప్పరవానిపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శేషగిరిరావులు పాల్గొని పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలు, పోలింగ్ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. మెప్మా పీడీ కిరణ్ కుమార్ సెక్టోరియల్ అధికారులు ఎన్నికల్లో ఎలాంటి విధులు నిర్వహిస్తున్నదీ అవగాహన కల్పించారు. ఈవీఎంలపై మెప్మా పీడీ కిరణ్ కుమార్, కె.శేషగిరిరావులు అవగాహన కల్పించారు. పోలింగ్‌పై ప్రధానోపాధ్యాయులు కె.శేషగిరిరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలింగ్ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో శాసన సభ స్థాయి మాస్టర్ ట్రైనర్స్, తదితరులు పాల్గొన్నారు.

ఆగిపోయిన లిఫ్ట్



లిఫ్ట్‌లో ఇరుక్కున్న చిన్నారులు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేశారు. లిఫ్ట్‌లో శుక్రవారం ఉదయం 9.45 గంటల సమయంలో కొందరు ఎక్కారు. మధ్యలో కరెంటుపోవడంతో లిఫ్ట్ అకస్మాత్తుగా ఆగిపోయింది. దీంతో దాదాపు 15 నిమిషాలకు పైగా ప్రయాణికులు అందులో ఉండిపోయారు. చిన్నారులు, వృద్ధులు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరయ్యారు. కాసేపటి తర్వాత కరెంటు రావడంతో లిఫ్ట్ యథావిధిగా నడిచింది. దీనిపై రైల్వే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సర్కారు చొరవే ఇదంత

ఆ పంచాయతీలో జనాభా 1402 మంది మాత్రమే. కానీ వారు వైద్యానికి పట్టణం వెళ్లాల్సిన అగత్యం లేదు. ఊరిలోనే విలేజ్ హెల్త్ క్లినిక్ ఉంది. అక్కడ మొత్తం ఇళ్ల సంఖ్య 412. తాగునీటి కోసం వేకువనే తగువులాడుకోవాల్సిన అవస్థ లేదు. ప్రతి ఇంటికీ కుళాయి వేశారు. చిన్న పంచాయతీ అని సర్కారు చిన్న చూపు చూడలేదు. తక్కువ జనాభా మాత్రమే ఉన్నారని శీతకన్ను వేయలేదు. పంచాయతీలో అభివృద్ధి పనులకు రూ.11 కోట్లు వెచ్చించింది. పిల్లల కోసం బడిని బాగు చేసింది. రైతుల కోసం ఆర్‌బీకే, కూరగాయల సేకరణ కేంద్రం కట్టింది. ఊరి కోసం సచివాలయం ఏర్పాటు చేసింది. ఊరికి కొత్త దారిని వేసి దశాబ్దాలుగా కల కంటున్న వంతెన నిర్మాణం పూర్తి చేసింది.



దంత జంక్షన్‌లో గరీబుల గెడ్డపై నిర్మించిన బ్రిడ్జి

రూ.2.98 కోట్లతో దంత జంక్షన్‌లో గరీబుల గెడ్డపై బ్రిడ్జి నిర్మించారు.

- అక్కడి నుంచి గ్రామంలో రోడ్లు విస్తరించారు. వీధుల్లో సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశారు.

- ప్రగతి బాటలో దంత పంచాయతీ
- అన్ని మౌలిక వసతులు కల్పించిన ప్రభుత్వం
- రూ.11 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు



కోటబొమ్మాళి: మండల కేంద్రానికి పదంటే పదే కిలోమీటర్ల దూరంలో ఉంటుంది దంత అనే ఊరు. ఐదేళ్ల కిందటి వరకు ఈ ఊరి ఉనికే ఎవరికీ తెలీదు. ఇప్పుడు ప్రగతి పథాన పయనిస్తున్న పల్లెల సరసన దంత కూడా చేరింది. దాసరిపేట అనుబంధ గ్రామంగా ఉన్న ఈ పంచాయతీ 2019 వరకు టీడీపీకి కంచుకోటగా ఉండేది. జనమంతా దండిగా ఆ పార్టీకే ఓటు వేసేవారు. కానీ ఆ కృతజ్ఞతను టీడీపీ నాయకులు చూపించలేకపోయారు. ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ఈ పల్లెను కన్నెత్తి కూడా చూడలేదు. దీని అభివృద్ధి గురించి పన్నెత్తి ఎన్నడూ మాట్లాడలేదు. ఊరికి వచ్చి ఓట్లు అడగడం తప్ప ఊరి కోసం చేసిన పనులేవీ లేవు. ఐదేళ్ల కిందటి వరకు స్థానికులు పడిన అవస్థలే అందుకు నిదర్శనం.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక దంత దశ మారింది. సర్పంచ్ గొండు చాందిని, ఆమె భర్త గొండు మురళి పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. గొండు చారిటబుల్ ట్రస్టును స్థాపించి సేవ చేయడం మొదలుపెట్టారు. దీనికి తోడు ప్రభుత్వం పల్లెలను బాగు చేస్తుండడంతో వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఒకప్పుడు అత్యవసర వైద్యం కోసం పది కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేదు. బడులు బాగు పడ్డాయి. దారులు కొత్తవి వచ్చాయి. కొత్త కొత్త భవనాలు ప్రత్యక్షమయ్యాయి. ఎప్పుడో వలస వెళ్లి ఇటీవల గ్రామానికి వచ్చిన వారు, పూర్వ విద్యార్థులు గ్రామాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

ఊరి రూపురేఖలు మారాయి



ఊరిలో సచివాలయం కట్టడంతో మాకు రావాల్సిన పత్రాలన్నీ ఇక్కడే అందుతున్నాయి. మా గ్రామానికి రోడ్లు, కాలువలు, తాగునీటి పథకం నిర్మించారు. సీఎంకు ధన్యవాదాలు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన మాకు ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.5 లక్షల వరకు మేలు జరిగింది.

– దండుపాటి తిరుపతిరావు, రైతు, దంత పంచాయతీ

ఊరి రూపురేఖలు మారాయి



మాకు పార్టీలకు అతీతంగా అన్ని పథకాలు అందుతున్నాయి. మా గ్రామంలో అన్ని వసతులు సమకూరాయి. దీంతో పది కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పని లేకుండా ఊరిలోనే అన్ని పనులు జరుగుతున్నాయి. సీసీ రోడ్లు, కాలువలు, కుళాయిలు, కల్యాణ మండపం కట్టారు. మా గ్రామం రూపురేఖలు మారాయి.

– వెలమల ధనలక్ష్మి, డ్వాక్రా మహిళ, దంత గ్రామం

అభివృద్ధి పనుల్లో కొన్ని..

- రూ.26లక్షలతో జల్‌జీవన్ మిషన్‌ద్వారా బోరు, వాటర్‌ట్యాంకు, 400 ఇళ్లకు ఇంటింటికీ కుళాయిలు వేశారు.
- నాడు–నేడు పథకం ద్వారా ఫేజ్–1లో రూ.19.20లక్షలతో పాఠశాలలో అభివృద్ధి పనులు రూ.6 లక్షలతో పాఠశాలలో జిమ్, రూ.2.5 లక్షలతో సాంస్కృతిక కళా వేదిక ఏర్పాటు చేశారు.
- మొత్తం 331 సామాజిక పింఛన్లు అందజేస్తున్నారు.
- జగనన్న ఇళ్లు 70 మందికి, స్థలాలు 40 మందికి అందజేశారు.
- రూ.50 లక్షలతో రైతుల కోసం పీఏసీఎస్ ద్వారా ధాన్యం నిల్వకు గోదాం, వే బ్రిడ్జి నిర్మించారు.
- రూ.7 లక్షలతో రజకుల కోసం దోబీ ఘాట్లు ఏర్పాటు చేశారు.
- రూ.40 లక్షలతో పెద్దచెరువు గట్టుపై మదనాపురం వరకూ రోడ్డు వేశారు.
- రూ.9 లక్షలతో శ్మశాన వాటిక, నిరీక్షణ భవనాలు నిర్మించారు.
- ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించారు.
- రూ.7లక్షలతో ఎస్సీ కార్పొరేషన్ కమ్యూనిటీ భవనం,రూ.12లక్షలతో రైతుల కోసం కూరగాయల సేకరణ కేంద్రం, రూ.15.6 లక్షలతో రైతుల కోసం పాలసేకరణ కేంద్రం నిర్మించారు.
- దాసరిపేట గ్రామానికి రూ.15 లక్షలతో తాగునీటి పథకం, సీసీ రోడ్లు, రూ.12లక్షలతో అంగన్‌వాడీ భవనం కట్టారు.





దంత గ్రామంలో నిర్మాణమైన సచివాలయం, ఆర్‌బీకే కేంద్రాలు



రూ.1.10 కోట్ల వ్యయంతో సచివాలయ భవనాలు, వెల్‌నెస్‌సెంటర్, ఆర్‌బీకే భవనం, డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేశారు.



రూ.12 లక్షలతో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుభకార్యాల నిర్వహణ కోసం కల్యాణ మండపం నిర్మించారు.




దంతలో సీసీ రోడ్డు నిర్మాణం

రథసప్తమికి పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రంగయ్య, పక్కనే డీసీ రమేష్‌బాబు

- 16న సూర్యజయంతి
- 3వేల వీఐపీ టికెట్ల విక్రయానికి చర్యలు
- దాతలకు, వీఐపీలకు తొలిసారి స్లాట్ సిస్టమ్
- సప్తమి ఉత్సవ సమన్వయ సమావేశంలో ఆర్డీఓ రంగయ్య



అరసవల్లి: ప్రఖ్యాత ఆదిత్య క్షేత్రం అరసవల్లిలో రథసప్తమి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని ఆర్డీఓ సీహెచ్ రంగయ్య తెలిపారు. ఆయన శుక్రవారం స్వామి సన్నిధిలో దేవదాయ శాఖ, పోలీస్, మున్సిపల్, వైద్యారోగ్యశాఖ, విద్యుత్ తదితర అనుబంధ శాఖల అధికార సిబ్బందితో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. గతంలో జరిగిన పొరపాట్లు, దర్శన సమయంలో ఇబ్బందులు ఈసారి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆయన వివరించారు. ఈ నెల 13న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మళ్లీ సమన్వయ సమావేశం జరుగుతుందని, ఈ లోగా శాఖాధికారులు చేపడుతున్న చర్యలపై స్పష్టతగా నివేదించాల్సి ఉంటుందన్నారు. ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు మాట్లాడుతూ తాను కొత్తగా విధుల్లోకి వచ్చానని, అయినప్పటికీ గత పరిస్థితులన్నీ తెలుసుకుని ఈ ఉత్సవాన్ని అందరి సహకారంతో ఘనంగా నిర్వహించేలా కృషి చేస్తానన్నారు.

ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి 12.20 గంటలకు (16వ తేదీ) స్వామి వారికి నిత్యార్చన, అనంతరం ఒంటి గంట నుంచి మూలవిరాట్టుకు శేషవస్త్రాల సమర్పణ, తర్వాత పంచామృతాలతో అభిషేకసేవ ప్రారంభమై ఉదయం 7 గంటల వరకు ఉంటుందని వివరించారు. అనంతరం నిజరూపదర్శనం సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని, 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అలంకరణ సేవ, అనంతరం ఏకాంతసేవ, పవళింపు సేవతో ఉత్సవం ముగుస్తుందని వి వరించారు. ఏర్పాట్లపై వన్‌టౌన్ సీఐ సన్యాసినాయు డు మాట్లాడుతూ నాలుగు సెక్టార్లలో బందోబస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వీఐపీ టిక్కెట్ల స్లాట్‌పై ప్రచారం చేయాలన్నారు. ట్రాఫిక్ సీఐ అవతారం మాట్లాడుతూ రథసప్తమి సందర్భంగా ట్రాఫి క్ ఆంక్షలు నగరంలో 15వ తేదీ రాత్రి 9 గంటల నుంచే అమలు చేస్తామని, ఇందుకు మూడు సెక్టార్లు పనిచేస్తాయన్నారు. ఆర్టీసీ బస్సులను పెద్దపాడు రోడ్డు నుంచి శాస్త్రులపేట మీదుగా వప్పంగి నుంచి గార వైపునకు, అరసవల్లి వైపునకు రాకపోకలు సాగేలా చర్యలు చేపడతామన్నారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించేలా 80 ఫీట్ రోడ్డులో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని, అయితే రెండు రోజుల ముందుగానే ఆలయం తరఫున సూచికల బోర్డులు ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖా ధికారి డాక్టర్ బి.మీనాక్షి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరావు తమ శాఖల తరఫున తీసుకోబోయే చర్యలు వివరించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక గ్రామ యువత ఉంగటి పాపారావు ఆధ్వర్యంలో 30 వేల మందికి ఉచిత అన్నప్రసాదం పంపిణీ జరుగుతుందని, అలాగే పలు సంస్థలు ప్రసాదాలను పంపిణీ చేస్తారని ప్రకటించారు.

కొత్త స్లాట్ సిస్టమ్

ఆదిత్యాలయ డిప్యూటీ కమిషనర్/ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు సూచనల మేరకు గతంలో రథసప్తమి ఉత్సవం జరిగిన తీరుతెన్నులను అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ సమావేశంలో వివరించారు. ఈసారి ప్రత్యేకంగా దాతలకు, వీఐపీలకు స్లాట్ టైమింగ్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నామని వివరించారు. కొత్తగా రూ.500 (విఐపి దర్శనం) టిక్కెట్లు మొత్తం 3 వేల దర్శన టిక్కెట్లు మాత్రమే అరసవల్లి యూనియన్ బ్యాంకులో విక్రయిస్తారని ప్రకటించారు. అలాగే 750 టిక్కెట్లకు ఒక్కో స్లాట్ ప్ర కారం నాలుగు స్లాట్‌లలో వీరికి ఆ రోజున ఉ దయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్లాట్ల ప్రకారం దర్శనాలకు అవకాశమిస్తున్నామని వివరించారు. అలాగే దాతలకు కూడా 15వ తేదీ అర్ధరాత్రి 12.30 (తెల్లవారితే 16వ తేదీ) నుంచి ఉదయం 7 గంటల వరకు మాత్రమే అనుమతిస్తున్నామని, తర్వాత ఇదే క్యూలైన్లలో వీఐపీ టిక్కెట్ల దర్శనాలకు అను మతి ఉంటుందని వివరించారు. ఇక క్షీరాభిషేక టిక్కెట్లను కూడా అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు అనుమతిస్తామని, తర్వాత ఇదే క్యూలైన్లలో రూ.500 (విశిష్ట దర్శనం) టిక్కెట్లదారులను దర్శనాలకు అను మతిస్తున్నామన్నారు. వీవీఐపీ పాసు లున్నవారికి, ఆలయ పాలకమండలి సభ్యులకు, కీలక ప్రజాప్రతినిధులకు సింహ ద్వారం నుంచి రాకపోకలకు వీలుగా క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నట్లుగా వివరించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధ, ఎస్.కోటేశ్వరచౌదరి, డాక్టర్ కె.సోమేశ్వరరావు, మైలపల్లి లక్ష్మి, జలగడుగుల శ్రీనివాస్, జోగి మల్లెమ్మ, లుకలాపు గోవిందరావు పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్ర వేసుకోవాల్సిందే: కలెక్టర్



ఇచ్ఛాపురం రూరల్: జగన్నాథపురం పాఠశాలలో విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు వేస్తున్న పిరియా విజయ



పోలాకి: నులిపురుగు ఆకారంలో గంగివలస కేజీబీవీ విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నులిపురుగుల నిర్మూలనకు పిల్లలంతా తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2 నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు కలిగిన ప్రీ స్కూల్(అంగన్‌వాడీ), పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఒక ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా అనివార్య కారణాల వల్ల స్కూల్‌కి రాకపోయినా వారికి మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ పలువురు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను, కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోర్డినేటర్ డాక్టర్ సీపీ శ్రీదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకట రమణ, ఉప విద్యాశాఖాధికారి రాకోటి విజయకుమారి, రవికుమార్, డాక్టర్ రమ్య, ఏఎస్ఎం మీనాక్షి, మోహిని, వెంకటేశ్వర్లు, సతీష్, అప్పలనాయుడు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత ముఖ్యం

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జగన్నాథపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులతో గడిపి ఆల్బెండజోల్ మాత్రల ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రను వేస్తున్న కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్

‘29లోగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్స్ చేయాలి’

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో దుకాణాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, మోటార్ రవాణా యాజమాన్యాలు, కార్మికులను వినియోగించిన కాంట్రాక్టర్లు, అంతర్ రాష్ట్ర కార్మికులను పనిలో పెట్టుకున్న యాజమాన్యాలు ఈ నెల 29లోగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని సర్టిఫికెట్ పొందాలని ఉపకార్మికశాఖ అధికారి ఎస్‌డీవీ ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో జిల్లా కార్మికశాఖ కార్యాలయంలో వర్తక, వ్యాపార సంఘాలతో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎల్ మాట్లాడుతూ ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసిన వారు తప్పనిసరిగా రెన్యువల్ సకాలంలో చేసుకోవాలని, అలాగే భవన, ఇతర నిర్మాణ యాజమాన్యం తప్పనిసరిగా భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. గతంలో విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం 2015 కింద కార్మిక చట్టాలు అన్నింటికీ ఒకే రిజిస్ట్రేషన్ లైసెన్సు పొందే వెసులుబాటు ఉందన్నారు. ఈ చట్టం కింద సంస్థల యాజమాన్యాలు, కాంట్రాక్టర్‌లు, రిజిస్ట్రేషన్ రెన్యువల్ కోసం సమీపంలోని మీ సేవా కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్‌లు, గ్రామ వార్డు సచివాలయాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్లు కె.అజయ్ కార్తికేయ, ఎ.యల్లాజీరావు, ఆర్‌వీ శ్రీనివాసరావు, బి.కొండలరావులతో పాటు వ్యాపార సంఘాల నాయకులు మెట్ట నాగరాజు, ఎస్.వి సతీష్, సుదర్శన్ పట్నాయక్, ఆర్.జగన్మోహనరావు, బి.మురళీధరరావు, బి.ఈశ్వరరావు, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న డీసీఎల్ ప్రసాద్

క్లుప్తంగా

'అటల్' విద్యార్థులకు సాంకేతిక సాయం


సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థి

టెక్కలి: సమాజానికి ఉపయోగపడే వివిధ ప్రాజెక్టుల రూపకల్పనలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కోసం రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని యునిసెఫ్ ప్రతినిధి టి.సుదర్శనరావు సూచించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అటల్ ఇన్నోవేషన్ చాలెంజెస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు కలిగిన పాఠశాలలకు చెందిన విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించిన సాంకేతిక శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ రకాల ప్రాజెక్టులకు ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం అవసరమో ఇంజినీరింగ్ విద్యార్థులంతా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యునిసెఫ్ ప్రతినిధి సుదర్శనరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విభిన్నమైన ఆలోచనలతో ప్రాజెక్టులను రూపకల్పన చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రాజెక్టుల రూపకల్పనకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి శిక్షణ అందజేయడానికి ఆదిత్య కళాశాల ముందుకు రావడం సంతోషకరమని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రాజెక్టుల రూపకల్పనలో వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి, కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.రఘువీర్, అధ్యాపకులు ఎం.వంశీనారాయణ, అటల్ ల్యాబ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో గిరిజనులకు ఉపాధి


రిజర్వాయర్ ఫిషరీస్‌లో బయో సెక్యూరిటీ వివరిస్తున్న అధికారులు

మందస: చేపల పెంపకం, వేటతో గిరిజనులకు ఉపాధి కలుగుతుందని సముద్ర జల ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ(ఎంపెడా) అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌నాయక్ అన్నారు. మండలంలోని బుడారిసింగి పంచాయతీలో గల కళింగదళ్ రిజర్వాయర్‌కు సంబంధించిన గిరిజన కుటుంబాలకు రిజర్వాయర్ ఫిషరీస్‌లో బయో సెక్యూరిటీ, వ్యక్తిగత పరిశుభ్రతపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చేపల వేటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చేపలు పట్టేటప్పుడు హైజినిక్ కండిషన్స్ తెలిపారు. రొయ్య పిల్లలను ఎన్నుకునే విధానం, పెంచే పద్ధతులపై మోడరన్ టెక్నిక్స్, అందుబాటులో ఉన్న టెక్నాలజీ తెలిపారు. ఎంపీఈడీఏ ద్వారా మంజూరవుతున్న స్కీమ్‌లను ఎలా ఉపయోగించుకోవాలో తెలిపారు. శిక్షణ పొందిన కుటుంబాలకు ఎంపీఈడీఏ ద్వారా బయో సెక్యూరిటీ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, బుడారిసింగి సర్పంచ్ సురేష్‌కుమార్ పాణిగ్రాహి, ఎంపీటీసీ సీర లోకనాథం, ఎస్ఎస్‌సీఎస్ఏ-ఎంపీఈడీఏ ఎస్సీఓ బాలాజీ, ఎఫ్ఎం పి.సునీల్‌కుమార్, ఎఫ్‌టీఓ సాయికిశోర్, ఎఫ్‌డీఓ ధర్మరాజు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు, పీడీలు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎచ్చెర్ల మండల పరిధిలోని కేశవరావుపేట గ్రామానికి చెందిన సనపల జగదీశ్వరరావు, గురుగుబెల్లి దుర్గాప్రశాంతి ఎంపికయ్యారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు బీహార్‌లోని పాట్నా వేదికగా ఆలిండియా జూనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్నాయి. పోటీల కోసం ఈనెల 18న ఏపీ జట్టుతోపాటు పయనమవుతున్నారు. జాతీయ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ముందు నేటి నుంచి మొదలయ్యే శిక్షణ శిబిరాలలో జగదీశ్వరరావు పాల్గొననున్నాడు. ఈ శిక్షణ శిబిరాలు అనంతపురంలోని ఆర్‌డీటీ క్రీడా ప్రాంగణం వేదికగా ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు 6 రోజులపాటు జరగనున్నాయి. శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. జాతీయ పోటీలకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసింహారాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షులు ఎంపీ రమణ, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ బడగల హరిధరరావు, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, ఎం.ఆనంద్‌కిరణ్, జాయింట్ సెక్రటరీ అన్నెపు రాజగోపాల్, పి.రమేష్, జి.మల్లేష్, ఢిల్లీ అభినందనలు తెలిపారు. జగదీశ్వరరావు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. దుర్గాప్రశాంతి ఎచ్చెర్ల వెంకటేశ్వరలో పాలిటెక్నిక్ ఫైనలియర్ (సివిల్) చదువుతోంది.

రథసప్తమి దర్శనాల
రూట్ మ్యాప్ ఇలా...


రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న, ఆర్డీఓ రంగయ్య, పక్కనే డీసీ రమేష్‌బాబు, ఏసీ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: రథసప్తమి మహోత్సవానికి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లు సిద్ధం చేస్తుండగా.. మరోవైపు ఆలయ ప్రాంగణంలో రంగులు, విద్యుత్ అలంకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు ఇతర అధికారులు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు.

దర్శన మార్గాలివే..

ఉచిత దర్శనం: అరసవల్లి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల వద్ద ప్రత్యేక క్యూ ద్వారా ఎంటర్ అయ్యి.. ఇంద్రపుష్కరిణి ఆగ్నేయ ద్వారం నుంచి కంపార్ట్‌మెంట్ల ద్వారా ఆలయంలోకి రావాల్సి ఉంటుంది.

రూ.100 (ప్రత్యేక దర్శనం): ఇది కూడా నగర కార్పొరేషన్ స్కూల్ దగ్గర నుంచే క్యూలో ఎంటర్ అయి.. క్యూలోనే టిక్కెట్టు కొనుగోలు చేసి పుష్కరిణి ఈశాన్య మార్గం నుంచి గోశాల పక్క నుంచి ఆలయంలోకి రావాల్సి ఉంటుంది.

క్షీరాభిషేక దర్శనం (రూ.500): ఈ క్యూ అరసవల్లి ప్రధాన రహదారిలో బొంపాడ వీధి దగ్గర నుంచి సింహద్వారం మీదుగా ఆలయ ప్రధాన ద్వారం నుంచి స్వామి దర్శనానికి వెళ్లాల్సి ఉంటుంది. అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఈ టిక్కెట్టుకు అనుమతి ఉంటుంది. లైన్లలోనే ఈ టిక్కెట్లు కొనుగోలు చేసుకోవాలి. ఒక టిక్కెట్టుతో ఇద్దరికి అనుమతిస్తారు.

రూ.500 (విశిష్ట దర్శనం): క్షీరాభిషేకం టిక్కెట్టు లైన్‌లోనే ఈ టిక్కెట్టు దారులను అనుమతించనున్నారు. అయితే ఉదయం 7 గంటల నుంచి మాత్రమే ఈ టిక్కెట్ల విక్రయాలు మొదలుకానున్నాయి. ఈ టిక్కెట్టుకు కూడా ఇద్దరిని అనుమతించనున్నారు.

డోనర్ పాసులు (దాతలు): ఈ దాతల పాసుదారులు బొంపాడ వీధి నుంచి ప్రత్యేక క్యూ ద్వారా ఆలయ ఉత్తర ద్వారం నుంచి దర్శనాలకు వెళ్లనున్నారు. అయితే వీరికి ఈసారి ప్రత్యేకంగా టైమ్ స్లాట్ అమలు చేస్తుండగా అర్ధరాత్రి 12.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నారు. ఇప్పటివరకు సుమారు 1000 మంది దాతలు రికార్డు అయ్యారు. ఒక్క పాసు ద్వారా నలుగురికి అనుమతి ఉంటుంది.

వీఐపీ దర్శన టిక్కెట్టు (రూ..500): దాతల పాసుల స్లాట్ టైమ్ ముగియగానే అంటే ఉదయం 7 గంటల నుంచి ఈ వీఐపీ దర్శన టిక్కెట్టు దారులకు (ఒక్కో టిక్కెట్‌కు ఇద్దరికి అనుమతి) ఇదే క్యూలైన్లలోనే దర్శనాలకు అనుమతిస్తారు. ఈ వీఐపీ దర్శన పాసులను అరసవల్లి యూనియన్ బ్యాంకులో విక్రయించేందుకు మొత్తం 3000 పాసులను సిద్ధం చేశారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు 750 మందికి, 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తర్వాత 750 మందికి, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మరో 750 మందికి, రాత్రి 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు చివరి 750 మంది పాసుదారులకు అనుమతించనున్నారు.

ఇక వీవీఐపీలకు అంటే అసెంబ్లీ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఆలయ పాలక మండలి సభ్యులు, ఇతర కీలక నేతలకు కూడా ఈసారి ప్రత్యేక దర్శన పాసులను అందుబాటులోకి తేనున్నారు. అయితే వీరిని ప్రత్యేక వాహనాల ద్వారా సింహద్వారం నుంచి అనుమతించి తిరిగి ఇదే మార్గంలో వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

హాకీ చాంపియన్‌షిప్ ప్రారంభం


హాకీ క్రీడను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. మండల పరిధిలోని పాత్రునివలసలో గల మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో టెక్కం కిశోర్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహించిన 14వ హాకీ ఏపీ జూనియర్స్ ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు.

పలు ప్రాంతాలకు చెందిన వారు ఒకే చోట కలిసి ఆడితే చాలా విషయాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం పాత్రునివలసలో పూర్తిస్థాయిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియం అభివృద్ధి చేసేందుకు కొంత సమయం పడుతుందన్నారు. పాత్రునివలసలో 14 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఆడుతున్నారని, వారికి స్థానికులు సహకరించాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆడుదాం ఆంధ్రా ఫైనల్ పోటీలు విశాఖపట్నంలో జరుగుతున్నాయని, ఈ పోటీలకు చాలామంది క్రీడాకారులు, కోచ్‌లు ఇప్పటికే విశాఖపట్నం చేరుకున్నట్లు మంత్రి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్ప దివ్య, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణ, పార్టీ నాయకులు గుమ్మా నగేష్, అల్లు లక్ష్మీనారాయణ, బాణాల గాంధీ, హాకీ కోచ్ అల్లు అనిల్‌కుమార్ పలువురు కోచ్‌లు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే
మొదటి ప్రాధాన్యత

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్


వ్యవసాయ మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతు ప్రయోజనాలే అధికారులకు మొదటి ప్రాధాన్యత కావాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్నారు. తొలుత అధికారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడారు. వ్యవసాయంతో ముడిపడి ఉన్న అనుబంధ శాఖలన్నీ సమన్వయం చేసుకుంటూ సమష్టిగా పనిచేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆయా రైతాంగానికి పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరేలా చూడాలన్నారు. జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు, పశు సంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ తదితర శాఖల తాజా పరిస్థితులను, సిబ్బంది వివరాలు, ఆయా శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు నకిలీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు చెల్లింపుల గురించి అడిగి రెండు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

వంశధారపై సుదీర్ఘ చర్చ

బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టుపై కలెక్టర్ దాదాపు గంట పాటు సంబంధిత అధికారులతో చర్చించారు. ఒడిశాతో నేరడి వివాదాన్ని, సైడ్ వియ్యర్ పనితీరు, సింగిడి, పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. హిరమండలం ప్రధాన రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్‌పై పలు ప్రశ్నలు అడిగారు. రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయినట్లు, ప్యాకేజీ 87, 88 పనులను, కాలువల పరిస్థితిని ప్రాజెక్ట్ ఎస్ఈ డోల తిరుమల రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ దశలో ప్రధాన రిజర్వాయర్ కోసం ప్రభుత్వం ఎత్తిపోతల పథకం మంజూరు చేసిందని 20 శాతం పనులు పూర్తయ్యాయని, ఈ ఏడాది గొట్టా నుంచి నీటిని పంపుల ద్వారా రిజర్వాయర్‌కి తరలించి 19 టీఎంసీల నీటిని నిల్వ ఉంచడమే లక్ష్యమని అన్నారు. ఇదే ప్రాజెక్టు ఆధారంగా ఉద్దానంలో 700 గ్రామాలకు మంచినీటి పథకం పనిచేస్తున్న వివరాలు తెలుసుకున్నారు. అలాగే మడ్డువలస, నారాయణపురం తాజా పరిస్థితిని కలెక్టర్ అడిగారు.

జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, వంశధార ఎస్ఈ డోల తిరుమల రావు, నీటి పారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్ రావు, పశు సంవర్ధక శాఖ జేడీ ఎం.కిశోర్, మత్స్య శాఖ డీడీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం రమణి, సెరికల్చర్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్ బాబు, ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.వి.ప్రసాద్, మార్కెటింగ్ ఏడి గంగాధర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై దాడి


దాడిలో గాయపడిన జరుగుళ్ల శంకరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మాజీ సర్పంచ్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జరుగుళ్ల విజయకుమారి భర్త జరుగుళ్ల శంకరరావుపై శుక్రవారం రాత్రి దాడి జరిగింది. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) క్యాంపస్ సమీపంలోని తన భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలు పరిశీలించి ఎస్ఎం పురం రోడ్డు నుంచి ఎచ్చెర్ల బైక్‌పై తాపీ మేస్త్రి మురళీతో ఇంటికి వస్తుండగా, దుండగులు దారి కాచి శంకరరావుపై రాడ్డులతో దాడి చేశారు. దీంతో ఆయన తల, ముఖానికి బలమైన గాయాలయ్యాయి. మురళీ సమాచారం మేరకు గ్రామస్తులు అక్కడకు చేరుకుని శంకరరావును శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో చేర్చారు. జీఆర్ పురం సీఐ రామచంద్రరావు, ఎచ్చెర్ల ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలోని పోలీసులు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుని నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులు మాస్కులు పెట్టుకొని ఇద్దరు వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే నిందితుల గాలింపుపై దృష్టి పెట్టారు.

దాడి దురదృష్టకరం: ఎమ్మెల్యే

మాజీ సర్పంచ్ జరుగుళ్ల శంకరరావుపై దాడికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఎచ్చెర్లకు చెందిన నేతింటి సత్యనారాయణ కారణమని భార్య విజయకుమారి, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే దీనిపై ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ స్పందిస్తూ రెండున్నరేళ్లుగా తనపై వ్యతిరేకంగా ఉన్నా ఏ రోజూ వారిని శత్రువుగా చూడలేదని అన్నారు. దాడి జరగడం దురదృష్టకరమన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న శంకరరావుకు అనేక మంది శత్రువులు ఉండవచ్చునని అన్నారు. దాడిలో తన ప్రమేయం అన్నది తప్పుడు ఆరోపణ అని తెలిపారు.

యువకుడు ఆత్మహత్య


లోకేష్ (ఫైల్)

కొత్తూరు: కొత్తూరు మండలం గులివిందలపేట గ్రామానికి చెందిన బంటు లోకేష్ (22) శుక్రవారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గులివిందలపేటకు చెందిన బటు రామారావు, లక్ష్మి దంపతుల చిన్న కుమారుడు లోకేష్. శుక్రవారం అతని తల్లి ఉపాధి పనికి వెళ్లిపోయారు. అన్నయ్య పశువులు కాయడానికి వెళ్లాడు. తండ్రి కూడా ఇంటి వద్ద లేరు. దీంతో లోకేష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు. లోకేష్ ఐటీఐ పూర్తి చేసుకొని వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. అతను ఓ బాలికను ప్రేమించాడని, అది విఫలం కావడంతో మనస్తాపంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని సమాచారం. అందివచ్చిన కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

గంజాయి రవాణా ముఠా అరెస్టు

- అరెస్టయిన వారిలో ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు


మాట్లాడుతున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి పూణెకు 72 కిలోల గంజాయిని తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పర్లాకిమిడి జంగం వీధిలో నివాసం ఉంటున్న ఉత్తర గౌడో సాహి, రాయగడ బ్లాక్‌కి చెందిన కుసా బుయాన్, తలముండా గ్రామానికి చెందిన రంజుగొమాంగోలు బరంపురంలో 72 కేజీల గంజాయిని కొనుగోలు చేసి లగేజీ బ్యాగ్, సూట్‌కేసులలో ప్యాక్ చేసుకొని కారు ద్వారా బుధవారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు.

అదేరోజు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో పుణే వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరి వద్ద లగేజీ గుర్తించిన ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు వారిని రూ.20వేలు లంచం అడిగారు. లేదంటే కేసు పెడతామని బెదిరించారు. దీంతో ఆ ముఠా సభ్యులు రూ.5వేలు మాత్రమే ఇచ్చారు. కానీ ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు ఒప్పుకోలేదు. దీంతో ముఠా సభ్యుడు రంజు గొమాంగో ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లతో సమీపంలోగల ఎస్‌బీఐ ఏటీఎంకి వెళ్లి రూ.10వేలు మరో చోట రూ.8వేలు తీసి ఇచ్చాడు. అప్పటికే ట్రైన్ వెళ్లిపోవడంతో గంజాయి ముఠా సభ్యులు రైల్వే స్టేషన్ సమీపంలోని చిదంబరేశ్వర ఆలయం వద్దకు చేరుకున్నారు. వీరిని చూసిన స్థానికులు అనుమానంతో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పట్టణ పోలీసులు వీరిని పట్టుకుని 72 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.23వేలు తీసుకుని గంజాయి రవాణాకు సహకరించిన ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ లక్ష్మణ్‌రావు, కవిటి ఎస్ఐ రాము సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో భవన నిర్మాణ కార్మికుడు మృతి


మృతుడు తమ్మినేని అప్పలరాజు (ఫైల్)

ఆమదాలవలస రూరల్: మండలంలో తొగరాం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు తమ్మినేని అప్పలరాజు (45) భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. అప్పలరాజు హైదరాబాద్‌లో తాపీ మేస్త్రీగా పని చేస్తున్నారు. ఎప్పటిలాగానే గురువారం భవన నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉండగా మూడో అంతస్తు పై నుంచి ప్రమాదవశాత్తు జారి కిందకు పడిపోయారు. వెంటనే సంఘటన స్థలంలో ఉన్న తోటి కూలీలు ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. మృతునికి భార్య భారతితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వలస మత్స్యకారుడు మృతి


క్రిష్ణ (ఫైల్)

రణస్థలం: మండలంలోని ఎన్‌జీఆర్‌పురం పంచాయతీలో గల గురయ్యపేట గ్రామానికి చెందిన చీకటి కృష్ణ(31) గుజరాత్ రాష్ట్రంలోని సోమనాథ్ జిల్లా వీరావల్‌లో మృతి చెందాడు. వీరావల్ నుంచి వేట కోసం నాలుగు రోజుల కిందట సముద్రంలోకి వెళ్లాడని, సముద్రంలోనే శుక్రవారం తెల్లవారు సమయంలో మృతి చెందాడని సమాచారం. అక్కడ ఏం జరిగిందో తెలియదని, మృతదేహం ఇంకా వీరావల్ ఒడ్డుకు రాలేదని గ్రామస్తులు, మత్స్యకార నాయకుడు పిల్ల తాత తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు పాపలు ఉన్నారు. కుటుంబమంతా గురయ్యపేటలోనే ఉంటున్నారు. మరణవార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

కోటబొమ్మాళి, గార: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి గార మండలం రామకృష్ణాపురానికి చెందిన మాసాభక్తుల జయనీష్(22) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పలాస రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రం కాగా.. జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తల్లి కృష్ణవేణి, తండ్రి జగన్ కన్నీరుమున్నీరయ్యారు.

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు

పొందూరు: స్థానిక బస్టాండ్ సమీపంలోని ఎంఎస్ఎన్ కాంప్లెక్స్‌లో సాయంత్రం అనకాపల్లి శ్రీనివాసరావు ఇంటిలో వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో వంట గదిలోని సామాన్లతో పాటు ఇంటిలో ఉన్న సోఫా ఇతర వస్తువులు కాలిపోయాయి. మంటలు వ్యాపించిన సమయంలో శ్రీనివాసరావు భార్య బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక వాహనంతో వచ్చిన సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

బుల్లి భల్లూకం

మందస: మండలంలోని బహడపల్లి-ఒంకులూరు మధ్యలో గల జీడితోటల్లో ఎలుగుబంటి రెండు పిల్లలకు జన్మనిచ్చింది. వీటిలో ఒకటి తల్లితో వెళ్లిపోగా.. రెండోది దారి తప్పి జీడితోటల్లో తిరుగుతోంది. తోటల్లో తిరుగుతున్న ఉద్దానం వాసులతో కాసేపు మమేకమైంది. అనంతరం అడుగులో, అడుగు వేసుకుంటూ తల్లిని వెదుక్కుంటూ వెళ్లిపోయింది. అనంతరం ఫారెస్ట్ బీట్ అధికారి ఎం.పోలయ్య సంఘటనా స్థలానికి వెళ్లి, స్థానికులతో మాట్లాడారు. ఎలుగుబంట్లను రెచ్చగొట్టవద్దని, పిల్లల జోలికి వెళ్లవద్దన్నారు.


తోటల్లో తిరుగుతున్న బంటి


ప్రజల వెంట వెళ్తున్న బుల్లి భల్లూకం

ద్విచక్ర వాహనదారులకు తీవ్రగాయాలు


క్షతగాత్రులను సపర్యలు చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ కంబిరిగాం గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారికి వెళ్లే సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో పలాస మండలం పెద్దనారాయణపురం గ్రామానికి చెందిన పిట్ట మాధవరావు, పిట్ట మోహన్‌రావులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సత్యం, శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.